క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

మరికల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వారికి న్యాయం చేయాలని బీజేపీ మండల నాయకులు వేణుగోపాల్, రమేష్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇస్తామని మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేమోసం చేయాలని చూస్తే భవిష్యత్‌లో ఈ రెండు పార్టీలకు పుట్టగతులుండవన్నారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా త్వరగా అర్హులను గుర్తించి ఇళ్లు మంజూరుచేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

విశ్రాంత పీఈటీ గోపాలంకు సన్మానం



మక్తల్: మండలంలోని సంగంబండ గురుకుల పాఠశాల విద్యార్థులకు జడ్చర్లలో జరిగిన జోనల్‌స్థాయి క్రీడాపోటీల్లో 10 బంగారు పతకాలు, 8 వెండి పతకాలు, 8 క్యాంస్య పతకాలు, మెమొంటోలు, ప్రశంసాపత్రాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ తెలిపారు. క్రీడాకారులకు పూర్తి స్థాయిలో కృషిచేసిన కోచ్ విశ్రాంత పీఈటీ గోపాలంను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రకళ, ఉపాధ్యాయులు శారద, లక్ష్మి, తిరుపతమ్మ, ప్రియాంక, భారతి, అనిత, పీఈటీలు వేదావతి, శ్రీలత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



మరికల్: మండల బీజేపీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి తండ్రి అకాల మృతిచెందడంతో అప్పంపల్లిలోని బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం బీజేపీ నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.

త్రైత సిద్ధాంత ప్రభోధ ప్రచారం



ఆత్మకూర్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఆత్మకూర్‌లో ప్రచార ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీక మాసం పురస్కరించుకుని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు సందేశాలు, భగవద్గీత శ్లోకాలు ఉచ్చరించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను పంచిపెట్టారు. డిసెంబర్ ఒకటి వరకు కార్తీక మాసం ఉంటుందని, ప్రతి ఒక్కరు దీపాలు వెలిగించాలని సూచించారు. నిర్వాహకులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామచంద్రయ్య, మాసన్న, శాంతి, అనిత, వెంకటమ్మ, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నర్వ: మండలంలోని కల్వాల్‌లో రహదారి పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. గ్రామంలోని బీసీకాలనీ, ఊర బావి వద్ద ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండి అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉందంటున్నారు. రహదారి పక్కన వెళ్లే చిన్నారులకు తాకేంత ఎత్తులో ఇది ఉండడంతో ఎప్పుడైన అటుగా వెళ్లే వారు ఆదమరిస్తే ఇక అంతే అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తును పెంచి ప్రమాదం జరగకుండా కాపాడాలని వారు కోరుతున్నారు.



అంబులెన్స్ లేక అవస్థలు

- అందుబాటులో లేని 108
- రోగులకు తప్పని తిప్పలు
- అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్న వైనం
- చొరవ చూపని అధికారులు, నాయకులు



అంబులెన్స్ లేని మాగనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మాగనూర్: అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలు కాపాడే అంబులెన్స్‌లు కరువయ్యాయి. ఉమ్మడి కృష్ణా, మాగనూర్ మండలాల్లోని 29 గ్రామపంచాయతీల్లో 34 గ్రామాలు ఉన్నాయి. సుమారు 50వేలకు పైబడి జనాభా కలిగి ఉంది. వైద్యసేవల కోసం మండల కేంద్రంతో పాటు మక్తల్‌లో ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. కానీ అంబులెన్స్ సౌకర్యం కల్పించలేదు. ఉమ్మడి మండలం కర్ణాటక రాష్ట్రానికి అతి చేరువలో ఉండటంతో పాటు తెలంగాణ రాష్ట్రానికి చివరగా ఉండటంతో వైద్యసేవల కోసం ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రం నుంచి 5నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. దీంతో అత్యవసర సమయంలో రావాలంటే ఇబ్బందికర పరిస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెండు మండల కేంద్రాలకు రెండు అంబులెన్స్‌లు, పీహెచ్‌సీలో ఓ ప్రత్యేక అంబులెన్స్ నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

108 కేటాయింపు ఎప్పుడో..?

గతంలో అనేకసార్లు అంబులెన్స్‌కోసం ఉమ్మడి మండల ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నారు. అయితే పలుమార్లు మండల కేంద్రానికి 108 వాహనం మంజూరవుతుందని ఉదరగొట్టారు. కానీ ప్రజలకు మాత్రం ఆ ఊహగహనాలే నీటి మూటలుగానే మిగిలాయి. అంబులెన్స్ మండలానికి కేటాయిస్తారో తెలియని పరిస్థితి.

వాహనం కేటాయించాలి..



మండలానికి ప్రత్యేకంగా 108 వాహనం కేటాయించాలి. అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవల కోసం ఆలస్యమవుతోంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. 108 మండలానికి కేటాయిస్తే బాధితులను సకాలంలో ఆస్పత్రులకు తీసుకెళ్లొచ్చు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

\- భరత్‌కుమార్, మాగనూర్, గ్రామస్తుడు

ఇబ్బందులు పడుతున్నాం..



మండల కేంద్రంలో అంబులెన్స్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 108 కు కాల్ చేస్తే, మక్తల్ నుంచి రావాల్సి వస్తోంది. ఏదైనా ప్రమాదం జరిగినా.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

\- నర్సింహారెడ్డి, పెగడబండ గ్రామస్తుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

రెండు మండలాలకు అంబులెన్స్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు సానుకులంగా స్పందించారు. త్వరలో రెండు మండలాలకు అంబులెన్స్‌లు అందుబాటులోకి రానున్నాయి.

\- సౌభాగ్యలక్ష్మి, జిల్లా వైద్యాధికారి

కొనసాగుతున్న ఇంటింటి సర్వే

మక్తల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. సర్వేలో భాగంగా ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరుగుతూ వారి వివరాలను సేకరించినట్లు అధికారులు పేర్కొన్నారు. సర్వేలో ఇంటి యజమానులు ఇచ్చే వివరాలను తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ రమేష్ ఎన్యుమరేటర్లకు సూచించారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు.



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

14 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్య

సీనియర్ న్యాయవాది వై తిప్పారెడ్డి



మాట్లాడుతున్న న్యాయవాది తిప్పారెడ్డి

ఆత్మకూర్: భారత రాజ్యాంగం ఆర్టికల్ 21ఏ, 45 ప్రకారం దేశంలోని 14 ఏళ్లలోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించాలని ఆత్మకూర్ సీనియర్ న్యాయవాది వై తిప్పారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందించాలని, ఆరేళ్లలోపు చిన్నారులందరికి పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రభుత్వాలు అమలు చేయాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ప్రతివాదిగా చేస్తూ గతంలో పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఇందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం హర్షనీయమని, ఎలాంటి షరతులు లేకుండా ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని కోరారు.

అమలుకు హైకోర్టు ఉత్తర్వులు..

ఉచిత నిర్బంధ విద్య అమలు కోసం హైకోర్టులో వేసిన పిటీషన్‌కు చీఫ్ జస్టీస్ సానుకూలంగా స్పందించి తీర్పును వెలువరించారని, అందుకు సంబందించిన ప్రతులు తనకు అందాయని న్యాయవాది తిప్పారెడ్డి తెలిపారు. ఈ విషయమై తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ 2025–26 విద్యాసంవత్సరంలో 14 ఏళ్లలోపు పిల్లలందరికి ఉచిత నిర్బంధ విద్యను అందిస్తామని అంగీకరించారన్నారు. భారతదేశంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై దృష్టి సారించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు కట్టలేక చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్‌ను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని, 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని, నారాయణపేట జిల్లాలోని మక్తల్‌ను రెవిన్యూ డివిజన్‌గా గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే కాంటా చేయాలి

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని వెంటనే కాంటా చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని సీపీఎం మండల నాయకులు భీమయ్య, సూర్యవంశ రాము డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతుల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను మంత్రి జూపల్లి ప్రారంభించి వారం రోజులవుతున్నా నేటికి కాంటా చేయకపోవడంతో రైతులు కేంద్రాల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్రాల్లో ధాన్యం కాంటా చేయడంలో జాప్యం చేస్తుండటంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయిస్తున్నారన్నారు. సన్న రకం వడ్లకు ఇస్తున్న రూ.500 బోనస్‌ను దొడ్డు వడ్లకు కూడా అందించాలన్నారు. దీంతో పాటు కేంద్రాల్లో నీడ కోసం టెంట్, నీటి వసతి కల్పించాలన్నారు. కేంద్రాల్లోని ధాన్యం కాంటా చేయాలని లేనిచో రైతులతో కలిసి ఆందోళన నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కమలాకర్, రైతులు పాల్గొన్నారు.



వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో ఆరా తీస్తున్న సీపీఎం నాయకులు

ముగిసిన కోటిలింగాల ప్రతిష్ఠ మహోత్సవం

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్త దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ధ్యాన మందిరంలో కోటిలింగాల ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం విజయవంతంగా ముగిసింది. కోటిలింగాల ప్రతిష్ఠమహోత్సవంలో భక్తులు పాల్గొని శివ కోటి యంత్రాలకు పూజలు చేశారు.

టీజీపీడీ అసోసియేషన్ తాత్కాలిక అధ్యక్షుడిగా నిరంజన్

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో ఆదివారం టీజీపీడీపెటా అసోసియేషన్ రాష్ట్ర సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో అన్ని జిల్లా అధ్యక్షుల, కార్యదర్శుల అభిప్రాయం ప్రకారం వ్యాయామ ఉపాధ్యాయుల సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం టీజీపెటాను టీజీపీడీపెటా సంఘంగా మారుస్తూ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు తాత్కాలిక కమిటీని ఎన్నుకున్నారు. వీటి ద్వారానే అన్ని జిల్లాల్లో కమిటీలు వేసి త్వరలో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకుంటామన్నారు. ఈ తాత్కాలిక కమిటీ అధ్యక్షుడిగా ఉమ్మడి జిల్లాకు చెందిన దూమర్ల నిరంజన్ (పీడీ జెడ్పీహెచ్‌ఎస్ వల్లూరు, మహబూబ్‌నగర్), సంయుక్త కార్యదర్శులుగా నిరంజన్‌యాదవ్ (పీడీ జెడ్పీహెచ్‌ఎస్ బిజినేపల్లి, నాగర్‌కర్నూల్), రమణ (పీడీజెడ్పీహెచ్‌ఎస్ కోటకొండ, నారాయణపేట)ను ఎన్నుకున్నారు.



తాత్కాలిక కమిటీ అధ్యక్షుడుగా నిరంజన్ తదితరులు

రేపు ఊరడమ్మ ఉత్సవాలు





అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో వెలసిన ఊరడమ్మ దేవత ఉత్సవాలు మంగళవారం కొనసాగనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని శుభ్ర పరిచి రంగులతో అలంకరించే పనుల్లో ఆలయ నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ప్రతి సంవత్సరం గ్రామ దేవతగా పూజలందుకుంటున్న ఉరేడమ్మ దేవత ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. అమ్మవారికి తీపి వంటకాలతో నైవేద్యం సమర్పించడం ప్రత్యేకత. ఉరేడమ్మ జాతరలో జంతుబలులు ఉండవని, ఇది సంప్రదాయమని నిర్వహకులు తెలిపారు.

గుంతలమయంగా రోడ్డు



మాగనూర్: మండలంలోని వర్కూర్, నెరడగం గ్రామాలకు వెళ్లే బీటీరోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ప్రజలు జంకుతున్నారు. రోడ్డు పాడై సంవత్సరాలు గడుస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి

మరికల్: సనాతన హిందూ ధర్మాన్ని రక్షించుకుందామంటూ ఆదివారం మండలంలోని పెద్దచింతకుంటకు వచ్చిన హిందూ ధర్మ జాగరణ రథయాత్ర కొనసాగింది. అనంతరం గ్రామంలోని ఆలయాల్లో పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రథయాత్రకు స్వాగతం పలుకుతూ గ్రామ పురవీధుల గుండా కళశాలతో ముందుకు కదలగా భజరంగ్ దళ్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు భజనలు చేస్తూ పురవీధుల గుండా కలియతిరిగారు. హైందవ సంస్కృతి గొప్పతనం, సనాతన ధర్మం కాపాడుకోవాల్సిన అవశ్యకతను ప్రజలకు వివరించారు.



రథయాత్రకు స్వాగతం పలికిన గ్రామస్తులు

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్

దామరగిద్ద: మండలానికి చెందిన పదిమంది విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. గోల్డ్ మెడల్ సాధించిన వారిలో దామరగిద్దకు చెందిన పుట్టి మణికంఠ, అరవింద్‌కుమార్, గోవింద్, పల్లవి, శ్రీనివాస్ నాయక్, నరేందర్‌నాయక్, కార్తిక్, నందు, శ్యామ్, వైష్ణవి ఉన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా?



వడ్వాట్ సమీపంలో రోడ్డుపై కమ్మేసిన కంపచెట్లు

మాగనూర్: మండలంలోని వడ్వాట్, అడవిసత్యరం గ్రామాలకు వెళ్లేరోడ్డు గుంతలమయంగా మారడంతోపాటు కంపచెట్లతో కమ్మేసి అధ్వానంగా తయారయ్యాయి. దీంతో ఈ రోడ్డు వెంట ప్రయాణించే ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోయి రోడ్డును పూర్తిగా కమ్మేశాయి. దీంతో ఎదురుగా వచ్చేవాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించడంతో పాటు రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

అమరచింతలో ‘దొడ్డురకం’ కొనుగోలు కేంద్రం

- అన్ని చోట్ల సన్నరకం కొనుగోలు కేంద్రాలు
- ఇదేక్కడి చోద్యమంటున్న రైతులు

అమరచింత: వానాకాలం పంట సాగులో అత్యధికంగా జిల్లా మొత్తంలో సన్నరకం వరిని కొనుగోలు చేస్తుంటే, అధికారులు అమరచింతకు మాత్రం దొడ్డురకం వరిని కొనుగోలు చేసేందుకు పీఏసీఎస్ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత వారం రోజుల క్రితం ప్రారంభించిన అధికారులు తమకు దొడ్డురకం వరిని కొనుగోలు కేంద్రం మంజూరైనట్లు తెలిపారు. ఈ విషయాన్ని పీఏసీఎస్ చైర్మన్‌తో పాటు సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. తమకు సన్నరకం కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో రైతులు మాత్రం తాము పండించిన సన్నరకం వరి పంటను ఎవరికి అమ్మాలో అర్థంకాక ధర తక్కువైనా దళారులకే అమ్ముకోవల్సిన పరిస్థితి ఏర్పడింది. అమరచింత ఎత్తిపోతల, పెద్దచెరువు ఆయకట్టు పరిధిలో రైతులు అత్యధికంగా సన్నరకం వరిపంటను పండించారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధరతో పాటు బోనస్ కోసం రైతులు స్థానికంగా కొనుగోలు కేంద్రం లేక పోవడంతో వ్యవసాయ శాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సమీపంలోని రంగాపురంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాలని సలహా ఇస్తున్నారు. దీంతో రైతులకు రవాణా చార్జీలు అధికమవుతున్నాయని, అధికారులు స్పందించి స్థానికంగా సన్నరకం వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



అమరచింత శివారులోని ప్రైవేట్ వెంచర్‌లో ఆరబోసిన వరిధాన్యం

నేటినుంచి ఆరాధనోత్సవాలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని సుభాష్‌రోడ్ సద్గురు అవధూత నర్సింహాస్వామి ఆరాధన మహోత్సవాలు సోమవారం నుంచి మూడురోజులపాటు వేద పండితుల మంత్రోచ్ఛరణాలతో ప్రత్యేకపూజలు, అభిషేకాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు మఠం కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు.. మఠానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరింపజేసి ఆరాధన ఉత్సవాలకు సిద్ధం చేశారు. సాయంత్రం జ్యోతిర్మయ నందగిరిమాత, బాల అవధూత ప్రకాశనంద సరస్వతి స్వామివారి ఊరేగింపు అనంతరం ధార్మిక ప్రవచనం ఉంటుందని తెలిపారు. పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

రమణీయం.. శివపార్వతుల కల్యాణం

- శతచండీయాగం, పూర్ణాహుతి
- ముగిసిన ఆశ్రమ వార్షికోత్సవం
- సందర్శించిన ఎంపీ డీకే అరుణ



సభలో మాట్లాడుతున్న పరిపూర్ణానందగిరిస్వామి

జడ్చర్ల టౌన్: లక్ష్మీనారాయణ స్వామి ఆశ్రమ వార్షికోత్సవంలో భాగంగా శివపార్వతుల కల్యాణం రమణీయంగా సాగింది. ఈ వేడుకలు ఆదివారం ముగిశాయి. మూడు రోజుల వేడుకల్లో పలు ఆశ్రమాల నుంచి పీఠాధిపతులు, మాతాజీలు హాజరై ఆశీర్వచనాలు ఇచ్చారు. మూడో రోజు ఉదయం 6గంటలకు గీతాపారాయణంతో వేడుకలు ప్రారంభించారు.

108 ద్రవ్యాలతో పూర్ణాహుతి..

వేడుకల్లో మూడురోజులుగా నిర్వహిస్తున్న శ్రీరుద్రసహిత శతచండీ యాగం 108 ద్రవ్యాలతో పూర్ణాహుతి సమర్పించారు. యాగం పూర్ణాహుతితో ఆశ్రమంలో ఆధ్యాత్మికశోభ వెల్లివిరిసింది.

20 వసంతాలు పూర్తిచేసుకోవటం...

లక్ష్మీనారాయణ స్వామి ఆశ్రమం ఏర్పాటు చేసి 20వసంతాలు పూర్తిచేసుకోవటంతో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అభినందనలు తెలిపారు. వేడుకల చివరిరోజున ఆమె ఆశ్రమాన్ని సందర్శించారు. దివంగత నిత్యశుద్దానందగిరి స్థాపించిన ఆశ్రమం ఈప్రాంతంలో ఉండటంతో ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల లోక కల్యాణం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.



పూర్ణాహుతి సమర్పణ

భగవవంతుడి ఆరాధనే మేలు: పీఠాధిపతులు

వేడుకల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన ఐదవ ఆత్మజ్ఞాన సభలో పలువురు పీఠాధిపతులు సందేశమిచ్చారు. ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి, కాకినాడ శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందసరస్వతి స్వామి భక్తులనుద్దేశించి ప్రసంగించారు. భగవంతుడిని ఆరాధించటంతో అన్నికష్టాలను సులభంగా దాటవచ్చన్నారు. ప్రపంచం అంతా పంచభూతాత్మకమని, భూమి, జలం, అగ్ని, వాయువు, ఆకాశాలని, వాటిని సంరక్షిస్తూ లోకకల్యాణానికి ఉపయోగపడేలా మన కృతజ్ఞత చూపాలన్నారు. వేడుకలు స్థానిక పీఠాధిపతి పరమాత్మానందగిరిస్వామి, వెంకట్‌చరణ్‌స్వామిల ఆధ్వర్యంలో కొనసాగాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు, వేడుకలకు సహకరించిన వారిని సత్కరించారు. ఆయా ఆశ్రమాల నుంచి వచ్చిన పీఠాధిపతులను సత్కరించి వారిచే ఆశీర్వచనాలు ఇప్పించారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్, కల్వకుర్తి, హైదరాబాద్ తోపాటు ఇతర రాష్ట్రాలనుంచి భక్తులు పెద్దసంఖ్యలో వేడుకలకు తరలివచ్చారు.